తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 78 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ బుధవారం 23 -10-2024 వెల: 5/రూ -


# ‘హాన్’ను ఎలా పునరుద్ధరించారు?



**నదికి తిరిగి జీవం పోసిన విధానాన్ని అడిగి తెలుసుకున్న పొంగులేటి బృందం**


**సియోనామ్ వాటర్ రిసోర్స్ రికవరీ ప్లాంట్ సందర్శన**

**యంగ్‌వన్ కార్పొరేషన్ చైర్మన్, సీఈవో కీ హాక్ సంగ్‌తో భేటీ**

**సియోల్‌లో రెండోరోజు పర్యటన**

హైదరాబాద్: మూసీ పునరుద్ధరణపై అధ్యయనానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో దక్షిణ కొరియాలోని సియోల్ వెళ్లిన అధికారుల బృందం రెండో రోజైన మంగళవారం అక్కడ విస్తృతంగా పర్యటించింది. తొలుత హాన్ నదిని సందర్శించి నది పునరుద్ధరణ పనులను పరిశీలించింది. ఒక ప్పుడు మురికి కాలువలా ఉన్న నదికి జీవం పోసిన విధానాన్ని మంత్రులు పొంగులేటి, పొన్నం అక్కడి అధికారులను అడిగి తెలుసుకు న్నారు. సియోల్‌లో నీటి సరఫరా, పర్యావరణ, ఆర్థిక వ్యవస్థకు ఈ నది ఎలా కీలకంగా మారిందో అక్కడి అధికారులు వారికి వివరించారు. అనంతరం మంత్రుల బృందం దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత వస్త్ర తయారీ సంస్థ యంగ్‌వన్ కార్పొరేషన్ చైర్మన్, సీఈవో ‘కీ హాక్ సంగ్’తో సమావేశమైంది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో వస్త్ర తయారీ పరిశ్ర మలు ఏర్పాటు చేసేందుకు ఇటీవల ముందు కొచ్చిన ఆయన.. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రులకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఏర్పాటైన ఫ్యాషన్ టెక్నాలజీ యూనివర్సిటీ, స్కిల్స్ యూనివర్సిటీ గురించి పొంగులేటి, పొన్నం ఆయనకు వివరించారు. ఆ తర్వాత సియోల్ లోని సియోనామ్ వాటర్ రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను అధికారుల బృందం సందర్శించింది. నీటి శుద్ధీక రణ ఎలా జరుగుతోందో

(మిగతా 2వ పేజీలో)





# గేమ్ చేంజర్‌గా డ్రోన్.. 15 రోజుల్లో పాలసీ

నాడు టెలికాం నియంత్రణల సడలింపు..

ఇప్పుడు డ్రోన్ డీరెగ్యులేషన్ సాధిస్తాం

డ్రోన్‌దే భవిష్యత్.. డేటాయే సంపద..

తయారీకి ఓర్వకల్లులో 300 ఎకరాలిస్తాం

డ్రోన్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

అమరావతి, అక్టోబరు 22 : ప్రధాని మోదీ .. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు తాను ఉండగా సాంకేతి కతలో ఇండియాను ఎవరూ తాకలేరని, ఆంధ్రప్రదేశ్‌ను ఎవరూ ఆపలేరని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం జరిగిన అమరావతి డ్రోన్ సమ్మిట్ - 2024కు ముఖ్యమంత్రి అధ్యక్షత

(మిగతా 2వ పేజీలో)



(మిగతా 2వ పేజీలో)


## కుల, మత రహిత కాలమ్ ఉండాల్సిందే

**2017లో దాఖలైన పిల్‌లో విచారణ ముగించిన హైకోర్టు ధర్మాసనం**



(మిగతా 2వ పేజీలో)

## ఇంటి పక్కనే అత్యాచారం... అయినా జగన్ పట్టించుకోలేదు: అనిత



## సీఎం సహాయనిధికి రూ.18.69 కోట్లు

డిప్యూటీ సీఎం భట్టికి చెక్కును అందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు



## ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి... అన్నివిధాలా సహకరిస్తాం: మోదీ

పుతిన్‌కు మరోసారి స్పష్టం చేసిన మోదీ

నేడు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ

కజాన్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి తక్షణం శాంతియుత పరిష్కారం కనుగొనాల్సిన అవసరముందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఎలాంటి సాయమైనా చేసేందుకు భారత్ సదా సిద్ధమని ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఈ మేరకు హామీ ఇచ్చారు. 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మంగళవారం రష్యాలోని కజాన్ నగరం చేరుకున్నారు. గత మూడు నెలల్లో మోదీ రష్యా వెళ్లడం ఇది రెండోసారి. కజాన్ చేరిన కాసేపటికే ఆయన పుతిన్‌తో సమావేశమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధంతో పాటు

(మిగతా 2వ పేజీలో)

# అవమానాలు చాలు.. ఇకనైనా బతకనివ్వండి



**ఈరోజు మమ్మల్ని కాంగ్రెస్ పార్టీ చంపేసింది**

**ఎన్జీవో పెట్టుకుని ప్రజలకు సేవ చేస్తా**

**ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిసంచలన వ్యాఖ్యలు**

**గంగారెడ్డి హత్యతో తీవ్ర భావోద్వేగం**

జగిత్యాల: ‘అవమానాలు చాలు.. ఇకనైనా బతకనివ్వండి. ఈ రోజు మమ్మల్ని కాంగ్రెస్ పార్టీ చంపేసింది. ఎన్జీవో పెట్టుకోనైనా ప్రజలకు సేవ చేస్తా..’అంటూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తన ప్రధాన అనుచరుడు గంగారెడ్డి హత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన ఒకానొక దశలో కాంగ్రెస్ పార్టీ చంపిందని వ్యాఖ్యానించారు. నాలుగు దశాబ్దాలపాటు పార్టీకి సేవ చేస్తే మంచి బహుమతి ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశాడు. గంగారెడ్డి హత్యతో ఆందోళనకు దిగిన జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జగిత్యాలకు రాగా ‘నీకో దండం.. నీ పార్టీకో దండం.. ఇకనైనా బతకనివ్వండి..’అంటూ దండం పెడుతూ వ్యాఖ్యానించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జీవన్‌రెడ్డికి ఫోన్ చేసి హత్యకు దారి తీసిన పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రయ త్నించగా మధ్యలోనే ఫోన్ కట్ చేశారు. ‘ఒకప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న. అయినా బీఆర్ఎస్ వైఫల్యాలు, ఉద్యోగుల సమస్యలు, మహిళల సమస్యలు, రైతుల సమస్యలు ఇలా అన్నీ లేవనెత్తి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశా. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో నా స్థానం ఎక్కడో

(మిగతా 2వ పేజీలో)



## కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు బాంబు బెదిరింపు హెచ్చరికలకు తెరపడటం లేదు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు సుమారు 50 విమానాల్లో బాంబులు పెట్టామంటూ ఆగంతకులు సోషల్ మీడియా ద్వారా బెదిరించారు. ఇందులో ఎయిరిండియా, ఇండిగోకు చెందిన 13 చొప్పున విమానాలు, ఆకాశ ఎయిర్‌కు చెందిన 12, విస్తార విమానాలు 11 ఉన్నాయి. బెదిరింపుల నేపథ్యంలో సోమవారం రాత్రి ఇండిగో తన మూడు సర్వీసులను సౌదీ అరేబియా, ఖతార్‌లకు మళ్లించాల్సి వచ్చింది. అయితే, ఇవన్నీ వట్టివేనని తేలింది. తాజా ఘటనతో కలిపి 9 రోజుల్లో 170కి పైగా విమాన సర్వీసులకు బెదిరింపులు అందినట్లయింది. బాంబు హెచ్చరికల కారణంగా

(మిగతా 2వ పేజీలో)

## రాష్ట్ర ఆదాయం తగ్గుతోంది



**కాంగ్రెస్ నేతల ఆదాయం పెరుగుతోంది**

**కొండా సురేఖపై రూ.100 కోట్ల పరువునష్టం:కేటీఆర్**

“పదేళ్లపాటు బుల్లెట్ వేగంతో.. పరుగులు పెట్టిన తెలంగాణకు అసమర్థ, అవినీతిపాలన శాపంగా మారింది. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆదాయం తగ్గుతోంది. ఆ పార్టీ నాయకుల ఆదాయం మాత్రం అమాంతం పెరుగుతోంది” అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తప్పులమీద తప్పులుచేసి తీరా.. తగ్గిన ఆదాయంపై అధ్యయనం కోసం ఇతర రాష్ట్రాలకు బృందాలను పంపించడం.. వారి అజ్ఞానానికి సజీవ సాక్ష్యమని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. పది నెలల పాలనలో అన్ని రంగాలను ఆగం చేశారని, కూల్చివేతల మనస్తత్వంతో రియల్ ఎస్టేట్ కుదేలైందని విమర్శించారు. మరోవైపు.. తన వ్యక్తిత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిని వదిలిపెట్టేది లేదని, మంత్రి కొండా సురేఖను ఉద్దేశించి కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి నీచమైన ప్రయత్నాలకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# గేమ్ చేంజర్‌గా డ్రోన్..15 రోజుల్లో పాలసీ

వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..చైనా, జపాన్, యూరోపియన్ దేశాల్లో యువత సంఖ్య తగ్గుతోందన్నారు. భారతదేశంలో యువత గణనీయంగా ఉండటమే ఆర్థికంగా దేశ ఎదుగుదలకు కారణమవుతుందని చెప్పారు. "రాష్ట్రాన్ని భవిష్యత్తు గేమ్ చేంజర్‌గా డ్రోన్‌లు మారుస్తాయి. అమరావతిని డ్రోన్ కేపిటల్‌గా మలుస్తాం. డ్రోన్ సమ్మిట్‌లో వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి 15రోజుల్లో డ్రోన్ పాలసీ తీసుకువస్తాం. దీని సేవలు విస్తృతంగా వినియోగించుకునేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో అనుసంధానిస్తాం. వ్యవసాయం, మౌలిక సదుపాయలు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్యసేవలకు డ్రోన్‌లను వినియోగించుకునేలా పరిశోధనలు సాగాలి" అని సీఎం కోరారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..



**ఆవిష్కరణలపై మోదీకి ఆసక్తి**

ప్రధాని మోదీ ఇంగ్లీషును బాగా మాట్లాడటంతోపాటు సాంకేతికతను త్వరగా అర్థం చేసుకోగలుగుతారని సీఎం చంద్రబాబు కితాబు ఇచ్చారు. నూతన అవిష్కరణలపై ప్రధాని మోదీ ఆసక్తిని చూపుతారని కొనియాడారు. "గతంలో టెలికాం నియంత్రణను తగ్గించేందుకు నాటి ప్రధాని వాజపేయి సహకరించారు. ఇప్పుడు డ్రోన్‌లను ఎగురవేయడంపై ఉన్న ఆంక్షలూ..నియంత్రణను ఎత్తివేసేందుకు ప్రధా ని మోదీ సహకరిస్తారనే నమ్మకం నాకుంది" అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో డ్రోన్ వినియోగాన్ని విస్తృతపరుస్తామన్నారు. " డ్రోన్‌ల ఎగురవేతపై ఆంక్షలు తగ్గించేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు ప్రయత్నించాలి. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాలను డ్రోన్ అకాడమీ, తయారీ, పైలట్ శిక్షణా కేంద్రాల కోసం కేటాయిస్తాం. గతంలో ప్రతి ఇంట్లో ఒక ఐటీ ఉద్యోగి ఉండాలని కోరాను. ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. డ్రోన్ వినియోగంపై ఆంక్షలు సడలిస్తే .. అవి ఇంకా మరిన్ని సేవలు అందిస్తాయి" అని సీఎం వివరించారు.

**యువకుడినైనా బాబుతో నేను పోటీ పడలేను: రామ్మోహన్**

డ్రోన్ కేపిటల్‌గా అమరావతిని మార్చడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు భరోసా ఇచ్చారు. "డ్రోన్ సమ్మిట్ ఎన్నికల కోసం కాదు...యువత భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్నాం. యువకుడినైన నేను..సీఎం చంద్రబాబు వినూత్న ఆలోచనలతో పోటీ పడలేకపోతున్నాను. రాష్ట్రంలో డ్రోన్ల తయారీ రంగానికి ప్రోత్సాహకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు.

"విజయవాడ వరదలప్పుడు డ్రోన్ సేవలను వినియోగించుకోవాలన్న ఆలోచన వచ్చింది. హెలికాప్టర్ల ద్వారా ఆహారం వరద ప్రాంతాల్లో పైనుంచి కిందకు వదిలేయడంవల్ల అవి ఎక్కువగా నీటిలో పడి పాడైపోయేవి. ఎత్తులో ఉన్న భవనాలపైకి విసరాలన్నా వీలయ్యేదికాదు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న డ్రోన్లను రప్పించాం. వ్యవసాయనికి వాడే ఆ డ్రోన్‌ల సాయంతో లక్షన్నర మంది బాధితులకు ఆహారం అందించాం. డ్రోన్ల వినియోగం వ్యవసాయం, మౌలిక సదుపాయలు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్యసేవలకూ విస్తరించాలి. ఇందుకు డ్రోన్ల డీరెగ్యులేషన్ జరగాలి"

**- సీఎం చంద్రబాబు**

# ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి... అన్నివిధాలా సహకరిస్తాం: మోదీ

పలు అంశాలపై నేతలిద్దరూ లోతుగా చర్చించుకున్నారు. "ఉక్రెయిన్ సంక్షోభానికి తెర దించే విషయమై మీతో నేను నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నా. నేను ముందునుంచీ చెబుతున్నట్టుగా ఏ సమస్యకైనా శాంతియుత పరిష్కారమే ఏకైక మార్గం" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఆయనతో అన్ని విషయాలపైనా అర్థవంతమైన చర్చ జరిగినట్టు అనంతరం ప్రధాని వెల్లడించారు. ఉక్రెయిన్‌పై రెండేళ్లకు పైగా జరుపుతున్న యుద్ధాన్ని విరమించేలా పుతిన్‌ను ఒప్పించి సంక్షోభానికి తెర దించగలిగింది మోదీ ఒక్కరేనని ప్రపంచ దేశాధినేతలంతా అభిప్రాయపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి భేటీకి అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. రెండు రోజుల పాటు జరగనున్న బ్రిక్స్ సదస్సులో భాగంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో కూడా మోదీ సమావేశమయ్యారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఆయన బుధవారం భేటీ కానున్నారు. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ మేరకు వెల్లడించారు.

**నాకు, మోదీకి మధ్య అనువాదం అవసరమే లేదు: నవ్వులు పూయించిన పుతిన్**

మోదీతో భేటీ సందర్భంగా పుతిన్ చేసిన వ్యాఖ్యలు నవ్వులు పూయించాయి. "భారత్‌తో రష్యా బంధం ఎంత బలంగా ఉందంటే నా మాటలను అర్థం చేసుకోవడానికి బహుశా మీకు అనువాదం కూడా అవసరం లేదేమో!" అని మోదీని ఉద్దేశించి పుతిన్ అన్నారు. దాంతో ప్రధానితో సహా భేటీలో పాల్గొన్న ఇరు దేశాల ఉన్నతాధికారులు తదితరులంతా చిరునవ్వులు చిందించారు. భారత్‌తో రష్యా బంధం అత్యంత ప్రత్యేకమైనది. ఎంతో దృఢమైనది. అది నానాటికీ మరింతగా బలపడుతోంది" అని ఈ సందర్భంగా పుతిన్ అన్నారు. అంతర్జాతీయంగా బ్రిక్స్ కూటమి ప్రాధా న్యం నానాటికీ పెరుగుతోందని మోదీ అభిప్రాయపడ్డారు. "కీలకమైన అంతర్జాతీయ అంశాలపై చర్చలకు బ్రిక్స్ ప్రధాన వేదికగా మారుతోంది. అభివృద్ధి, పరస్పర సహకారం, వాతావరణ మార్పులు, ఆర్థిక సహకారం, దేశాల మధ్య పలు రకాలైన కీలక సరఫరా వ్యవస్థల నిర్మాణం వంటివాటిపై నూతన ఆలోచనల కలబోతకు కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. గతేడాది పలు కొత్త దేశాలు బ్రిక్స్ సభ్యులుగా చేరాయి. మరెన్నో దేశాలు చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ శాంతి, ప్రగతికి సంబంధించిన పలు కీలక అంశాలపై బ్రిక్స్ దేశాధినేతలతో ఫలవంతమైన చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు. ఈ కూటమి 2006లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలతో బ్రిక్ పేరిట ఏర్పాటైంది. 2010లో దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్‌గా మారింది. గతేడాది ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ కూడా కూటమిలో చేరాయి.

**కాల పరీక్షకు నిలిచిన బంధం: మోదీ**

గత మూడు నెలల్లోనే రష్యాలో ఇది తన రెండో పర్యటన అని మోదీ గుర్తు చేసుకున్నారు. "ఇరు దేశాల మధ్య నానాటికీ బలపడుతున్న ప్రగాఢ బంధానికి, స్నేహానికి, సమన్వయానికి ఇది సూచిక. రష్యా, భారత మైత్రి కాలపరీక్షకు నిలిచిన బంధం. భారత ఆర్థికాభివృద్ధిలో, భద్రతలో రష్యాది కీలక పాత్ర" అంటూ ప్రస్తుతించారు. చరిత్రాత్మక కజాన్ నగరంలో భారత్ నూతన కాన్సులేట్‌ను తెరవడం పట్ల ఆనందంగా ఉందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. గత జూలైలో కూడా ఆయన రష్యాలో పర్యటించడం తెలిసిందే. ఆ సందర్భంగా పుతిన్‌తో జరిగిన శిఖరాగ్ర భేటీలో పలు విషయాలపై లోతుగా చర్చించారు.

# ఆరబోసిన ధాన్యం నీటిపాలు

## చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వరదలో కొట్టుకుపోయిన ధాన్యం సకాలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం

చౌటుప్పల్: సకాలంలో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోముడంతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటంతా నీటిపాలు చేయాల్సి వచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మంగళవారం సాయంత్రం కురిసిన ఆకస్మిక భారీ వర్షానికి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం రాశులు కొట్టుకుపోయాయి. ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టుకుని తిరిగి కుప్పలు పోసుకునే సమయంలో వర్షం రావడంతో రైతులు ఏమి చేయాలో తెలియక పరుగులుమొట్టారు. అప్పటికప్పుడు ధాన్యాన్ని కుప్పలుుగా పోసుకున్నారు. పట్టాలు కప్పుకున్నారు. పెద్ద ధాన్యం కుప్పలను ట్రాక్టర్లతో దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం చేశారు. అయినా వర్షం భారీగా కురవడంతో వరద నీటి ప్రవాహంలో ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. దీంతో రైతులు బోరున విలపించారు.



# నగరంలో సీఆర్‌పీఎఫ్ స్కూల్‌కు బాంబు బెదిరింపు

## బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు.. బాంబు లేదని నిర్ధారణ



జవహర్‌నగర్: ఢిల్లీలోని ఓ సీఆర్పీఎఫ్ పాఠశాల ప్రహరీ వద్ద మూడు రోజుల కిందట బాంబు పేలుడు సంభవించిన ఘటనను మరువక ముందే హైదరాబాద్ శివారులోని జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సీఆర్పీఎఫ్ పాఠశాలకు వచ్చిన బాంబు బెదిరింపు సందేశం మంగళవారం కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి సీఆర్పీఎఫ్ పాఠశాలకు ఈ%-%మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సందేశం పంపారు. జవహర్‌నగర్ సీఆర్పీఎఫ్ పాఠశాలతోపాటు ఢిల్లీలోని రోహిణి, ద్వారకాలోగల సీఆర్పీఎఫ్ పాఠశాలలో బాంబులు అమర్చినట్లు అందులో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పాఠశాల ప్రారంభమయ్యాక యాజమాన్యం ఈ-మెయిల్‌ను చూసి అప్రమత్తమైంది. వెంటనే విద్యార్థులను బస్సుల్లో ఇళ్లకు తరలించడంతోపాటు పోలీసులకు సమాచారం అందించింది. దీంతో సీఆర్పీఎఫ్, ఆర్‌ఏఎఫ్ పోలీసులతోపాటు రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, కుషాయిగూడ ఏసీపీ మహేశ్, జవహర్‌నగర్ సీఐ సైదయ్య పాఠశాలకు చేరుకొని పరిసర ప్రాంతాలను, పాఠశాల భవనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జాగిలాలతో, బాంబు స్క్వాడ్‌తో అనువనవూ గాలించి బాంబు లేదని నిర్ధారించారు. తమిళనాడు డిప్యూటీ సీఎం సతీమణి పేరున కొందరు దుండగులు ఫేక్ ఐడీ సృష్టించి ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

# కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

బెంగళూరు-జెడ్డా సర్వీసును దోహ్(ఖతార్)కు, కోజికోడ్-జెడ్డా విమానాన్ని రియాద్(సౌదీ అరేబియా)కు, ఢిల్లీ-జెడ్డా సర్వీసును మదీనా(సౌదీ అరేబియా)కు మళ్లించామని ఇండిగో తెలిపింది. ప్రయాణికులందరినీ సురక్షితంగా దించి వేసి, విమానంలో పూర్తి స్థాయిలో తనిఖీలు జరిపామని వివరించింది. ఢిల్లీ-దమ్మమ్, ఇస్తాంబుల్-ముంబై, ఇస్తాంబుల్-ఢిల్లీ, మంగళూరు-ముంబై, అహ్మదాబాద్-జెడ్డా, హైదరాబాద్-జెడ్డా, లక్నో-పుణే విమానాలకు కూడా బాంబు హెచ్చరికలు అందాయని ఇండిగో వెల్లడించింది. అయితే, ఎయిరిండియా తమ విమాన సర్వీసులకు అందిన బాంబు బెదిరింపులపై ఎటువంటి ప్రకటన చేయలేదు. సోషల్ మీడియా ద్వారా తమ విమానాలకు కూడా బెదిరింపులు వచ్చాయని విస్తార ప్రతినిధి చెప్పారు. మిగతా వివరాలను ఆయన తెలపలేదు. బాంబు బెదిరింపులు వట్టివేనని తెలిసినా, ఈ విషయాన్ని సీరియస్‌గానే తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. 1982 నాటి సప్రెషన్ ఆఫ్ అన్ లాఫుల్ యాక్ట్స్ ఎగెనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్(ఎస్‌యూఏఎస్‌సీఏ)కు సవరణలు చేయాలని కేంద్రం యోచిస్తోంది. దీని ప్రకారం బెదిరింపులకు పాల్పడే వారిని కోర్టు ఉత్తర్వులతో పనిలేకుండానే వెంటనే అరెస్ట్ చేసి, విచారణ చేపట్టేందుకు అవకాశమేర్పడుతుంది. అలాగే, దోషులకు కఠిన శిక్షలు పడేలా విమాన భద్రతా నిబంధనలను మార్చాలని కూడా కేంద్రం భావిస్తోంది.

**9 రోజుల్లో రూ.600 కోట్ల నష్టం**

తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న బాంబు బెదిరింపుల కారణంగా విమానయాన సంస్థలకు రూ.600 కోట్ల మేర నష్టం వాటిల్లి ఉంటుందని విమానయాన సంస్థల మాజీ అధికారులు అంటున్నారు. దేశీయ విమానాలకైతే నష్టం సుమారుగా రూ.1.5 కోట్ల చొప్పున, అంతర్జాతీయ సర్వీసులకైతే రూ.5 కోట్ల నుంచి రూ.5.5 కోట్ల వరకు నష్టం ఉంటుందని చెప్పారు. దేశీయ, అంతర్జాతీయ విమానాలకు కలిపి సగటున రూ.3.5 కోట్ల మేర నష్టం ఉంటుందని, ఈ లెక్కన 170 విమానాలకు కలిపి ఈ నష్టం రూ.600 కోట్ల వరకు ఉంటుందని వారు అంచనా వేశారు. ఎయిర్ పోర్టులో పార్కింగ్ చార్జీలు, ఇంధనం వంటి ప్రత్యక్ష ఖర్చులతోపాటు ఇతర విమానాల షెడ్యూళ్లపై పడే పరోక్ష ప్రభావాన్ని కూడా లెక్కించాల్సి ఉంటుందన్నారు.

# 'హాన్'ను ఎలా పునరుద్ధరించారు?


పరిశీలించింది. సియోల్‌లోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన వ్యర్థ జలాలను ఈ కేంద్రాలు శుభ్రపరుస్తాయి. రోజుకు 16.3 లక్షల లీటర్ల మురుగునీటితోపాటు 4 వేల కిలోలీటర్ల వ్యర్థాలను శుద్ధి చేస్తాయి. ఈ సామ ర్థ్య ం ప్రపంచంలోనే 9వ అతిపెద్ద ప్లాంటుగా గుర్తింపు పొందింది. ఇదే కేంద్రంలో హాన్ నది నీటి స్వచ్ఛతను కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు.

**ప్రతిపక్షాలు సహకరించాలి**

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అమలయ్యేందుకు ప్రతిపక్ష పార్టీలు సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సియోల్ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిలో మూసీని భాగం చేయాలని తమ ప్రభు త్వం భావిస్తోందన్నారు. నిర్వాసితులకు ఎలాంటి కష్టం రానివ్వబోమని.. పునరావాసంతోపాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పొన్నం హామీ ఇచ్చారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి తలపెట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుతో హైదరాబాద్ మరో సియోల్ నగరంగా రూపాంతరం చెందుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

# ఇంటి పక్కనే అత్యాచారం... అయినా జగన్ పట్టించుకోలేదు: అనిత

అమరావతి, అక్టోబరు 22 : 'జగన్ సీఎంగా ఉండగా తన ఇంటికి కూత వేటు దూరంలో ఒక దళిత యువతిపై కాబోయే భర్త ఎదురుగా సామూహిక అత్యాచారం జరిగితే ఆయన ఆ వైపు కూడా చూడలేదు. కాలు కదిపి పరామర్శించలేదు. నిందితులను పట్టుకోవడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. రాష్ట్రాన్ని దోచుకోవడానికి, దాచుకోవడానికే సమయం అంతా వెచ్చించాడు. పదవి పోయిన తర్వాత ఇప్పుడు పరామర్శలకు బయలుదేరడానికి సిగ్గుండాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. మంగళవారం ఆమె ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర సంస్థల నివేదిక ప్రకారం జగన్ హయాంలో రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల మీద జరిగిన ఘోరాలపై 2.04 లక్షల కేసులు నమోదయ్యాయని.. వాటిలో ఒక్కదానిపై నా ఆయన మాట్లాడలేదని.. ఏనాడూ సమీక్షలు జరపలేదని తెలిపారు. 21 రోజుల్లో శిక్షలు అంటూ చట్టబద్ధత లేని దిశ చట్టం గురించి పనికిమాలిన ఉపన్యాసాలు ఇచ్చారని దుయ్యబట్టారు.



# సీఎం సహాయనిధికి రూ.18.69 కోట్లు

## డిప్యూటీ సీఎం భట్టికి చెక్కును అందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

హైదరాబాద్, అక్టోబరు 22 : వరద బాధితుల సహాయార్థం రూ.18.69 కోట్ల సహాయాన్ని విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వానికి అందించారు. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మంగళవారం కలిసి రాష్ట్రవ్యాప్తంగా నాలుగు విద్యుత్ సంస్థల్లో ఉన్న 70 వేలమంది ఉద్యోగులకు చెందిన ఒక రోజు మూలవేతనం రూ.18.69 కోట్లను చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో/జెన్‌కో సీఎండీ సందీపకుమార్ సుల్తానియా, దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ట్రాన్స్‌కో జేఎండీ చెరుకూరి శ్రీనివాసరావు, విద్యుత్ సంఘాల ప్రతినిధులు సాయిబాబు, శ్రీధర్, శివాజీ, రత్నాకర్‌రావు, సచ్చిదానందం తదితరులు ఉన్నారు.

# కుల, మత రహిత కాలమ్ ఉండాల్సిందే

## 2017లో దాఖలైన పిల్‌లో విచారణ ముగించిన హైకోర్టు ధర్మాసనం

హైదరాబాద్: ప్రభుత్వ సర్టిఫికెట్లు, పాఠశాలలో చేరే ముందు సమర్పించే దరఖాస్తులో కుల, మత రహిత కాలమ్ ఉండాల్సిందేనని సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. కులం, మతం వద్దనే హక్కు ప్రజలకు ఉందని అభిప్రాయపడింది. కుల, మత విభాగాలను దరఖాస్తులో నింపనంత మాత్రాన అవి తిరస్కరణకు గురికావని పాఠశాల విద్యాశాఖ సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌ను పరిశీలనలోకి తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. 2010, 2021లోనూ రిట్ పిటిషన్లు దాఖలు చేసి కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు ఇప్పటికే ఉపశమన ఆదేశాలు పొందారని పేర్కొంది. బాధిత వ్యక్తులు అవసరమైతే తదుపరి నష్టపరిహారాన్ని కోరే హక్కు కలిగి ఉంటారని వ్యాఖ్యానించింది. పాఠశాల విద్యాశాఖ స్పష్టమైన వైఖరితో తదుపరి చర్యలు అనవసరమని పేర్కొంటూ పిల్‌లో విచారణ ముగిస్తున్నామని చెప్పింది. జనన ధ్రువపత్రం నుంచి మరణ ధ్రువపత్రం వరకు అన్నింటిలో 'కులం, మతం లేదు' అనే స్టేటస్ కోరుకునే వారిని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదంటూ డీవీ రామకృష్ణారావు, ఎస్ క్లారెన్స్ కృపాళిని తదితరులు 2017లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఇలాంటి పిటిషన్లు గతంలో దాఖలయ్యాయని, కులం, మతాన్ని పేర్కొనడం, వదులుకోవడంపై స్వేచ్ఛ ఉందని పాఠశాల విద్య డైరెక్టర్ అండ్ కమిషనర్ తరఫున దాఖలు చేసిన కౌంటర్‌లో పేర్కొన్నారని చెప్పింది. మతం, కులం వివరాలు పేర్కొననంత మాత్రాన పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశం నిరాకరించబడదని స్పష్టం చేసింది. దీంతో విచారణ ముగిస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

# అవమానాలు చాలు.. ఇకనైనా బతకనివ్వండి

ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నో అవమానాలు తట్టుకుంటున్నాం. ఇక ఓపిక లేదు. బీఆర్‌ఎస్ దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని, తట్టుకొని నిలబడితే.. ఈరోజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇబ్బందికరంగా మారింది. పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడంతో ఈరోజు జగిత్యాలలో ఎలాంటి పరిస్థితులున్నాయో ఈ ఘటన ద్వారా తెలుస్తుంది. మానసిక అవమానాలకు గురయ్యాం. అది చాలదన్నట్టు భౌతికదాడులకు తెగబడుతున్నారు'అంటూ జీవన్‌రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

**కాంగ్రెస్ ప్రభుత్వమా? బీఆర్‌ఎస్ ప్రభుత్వమా?**

ఇప్పుడు తాము కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నామో.. లేక బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉన్నామో అర్థం కావడం లేదని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీలకు నైతిక విలువ లు ఉండాలని సూచించారు. గతంలో కేసీఆర్ ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలని చూ సి ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారని, ఆయన పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు.

# ఆదివాసీల వేగు చుక్క కొమురం భీమ్ : నీలం మధు ముదిరాజ్..






**పఠాన్ చెరు :డైలీ రిపోర్ట్ అక్టోబర్ 22:** తెలంగాణ విముక్తి కోసం, నిజాం కార్యకలాపాలకు వ్యతిరేకంగా తనదైన శైలిలో పోరాడిన పోరాట యోధుడు కొమురం భీమ్ అని మెదక్ పార్లమెంటు కంటెస్టేడ్ కాంగ్రెస్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.కొమురం భీం జయంతి సందర్భంగా చిట్కుల్ లోని క్యాంపు కార్యాలయంలో కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీ,దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వారితో విరోచితంగా పోరాడినటువంటి పోరాట యోధుడు కొమరం భీమ్ అన్నారు.ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసి అణగారిన వర్గాలకు ఆత్మబంధువుగా మారాడని తెలిపారు.అడవులను నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలపై నిజాం సర్కార్ పాశవిక చర్యలకు పాల్పడిన సందర్భంలో 'జల్, జంగల్, జమీన్' నినాదంతో నిజాం సర్కారుపై భీకరంగా పోరాడి వీర మరణం పొంది ఆదివాసుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని కొనియాడారు.ఆ మహావీరుడు పోరాట స్ఫూర్తిని నేటి తరం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వి నారాయణరెడ్డి,మురళీ, గోపాల్,ఉళ్ళ శంకర్,మన్నే రాఘవేంద్ర, కంజార్ల రవి,విష్ణువర్ధన్, పృట గోపాల్,సోములు,మల్లేశం,మనోహర్,మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.



## రక్తదానం చేసిన పట్వారీ శశిధర్ టీమ్ సభ్యులు

**గచ్చిబౌలి :(డైలీ రిపోర్ట్ )అక్టోబర్ 22:** పోలీసు అమరవీరులకు నివాళు అర్పిస్తూ గచ్చిబౌలి కమీషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పట్వారీ శశిధర్ టీమ్ సభ్యులు రక్తదానం చేశారు.మంగళవారం కమీషనర్ అవినాష్ మహంతి ఐ పి యస్, పిలుపు మేరకు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్సై రాజేష్,ఎస్సైశంకర్ లతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రక్తదానం చేయడం గొప్ప విషయమని,యువత ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని తెలిపి కమిషనర్ వారిని అభినందించారు.

## ఇది కుట్రా... లేక ద్వేషమా?

### హిందూ వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్ సమాధానం చెప్పాలి

### కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై 'ఎక్స్'వేదికగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్: వివిధ హిందూ సంస్థల కార్యకర్తల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. హిందూ సంస్థల పట్ల, ఆ సంస్థల కార్యకర్తలపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా విరుచుకుపడ్డారు. 'ఇది కుట్రా? లేక ద్వేషమా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని హిందూ వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలి'అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'ముందుగా...భారతీయ న్యాయసంహిత సెక్షన్ 176, సెక్షన్ 173 నిబంధన కింద 3 క్రిమినల్ కేసులకింద ఎఫ్ఐఆర్ ఫైల్ చేసిన పోలీసులు..సోమవారం అర్ధరాత్రి సమయంలో..ఆ ఎఫ్ఐఆర్‌లో మార్పులు చేసి సెక్షన్ 109 (హత్యాయత్నం)ను చేర్చారు. ఇది హిందూ సంస్థల సభ్యులను హింసించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచనను తెలియజేస్తోంది'అని ఎక్స్‌లో పేర్కొన్నారు.



## ఏసీబీకి చిక్కిన పెబ్బేర్ మున్సిపల్ కమిషనర్?



**వనపర్తి జిల్లా: డైలీ రిపోర్ట్ అక్టోబర్22:** వనపర్తి జిల్లా పెబ్బేర్ మండలం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ దాడులు నిర్వహించారు. పెబ్బేర్ మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు కాంట్రాక్టర్ నుంచి రూ.20,000 లు లంచం తీసుకుంటుండగా మహబూబ్ నగర్ ఏసీబీ అడిషనల్ ఎస్పీ బి.శ్రీకృష్ణ గౌడ్, కమిషనర్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నా రు. 2023 లోని పెయింటింగ్ మరియు సీసీ రోడ్ల కాంట్రాక్ట్ పనులకు నిధులను మంజూరు చేయడానికి లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి.

## మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాల్‌కు నోటీసులు

### రూ.45.46 కోట్ల బకాయిలు చెల్లించాలని ఆదేశం

బీఆర్ఎస్‌కు చెందిన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిమాల్‌కి ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు మంగళవారం షాక్ ఇచ్చారు. జీవన్‌రెడ్డి మాల్‌కు మరోసారి కార్పొరేషన్ నోటీసులు ఇచ్చింది. ఆర్మూర్ ఆర్టీసీ డిపో స్థలంలో నిర్మించిన వ్యాపార సముదాయం.. బకాయిలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కార్పొరేషన్ నోటీసులు ఇచ్చింది. రూ.45.46 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలంటూ నోటీసులో పేర్కొంది. కాగా గతంలో జీవన్‌రెడ్డికి ఆర్టీసీ, విద్యుత్ అధికారులు షాక్ ఇచ్చారు. ఆర్మూర్‌లోని ఆర్టీసీ స్థలాన్ని అద్దెకు తీసుకుని ఆ స్థలంలో షాపింగ్ మాల్‌ని జీవన్‌రెడ్డి నిర్మించాడు. అయితే షాపింగ్ మాల్ అ÷-దదెని గత కొంత కాలంగా కట్టకుండా ఎగ్గొడుతున్నాడు. సుమారుగా రూ.7.50 కోట్ల అద్దె బకాయిలు చెల్లించకుండా ఆర్టీసీ అధికారులను బెదిరిస్తూ వస్తున్నాడు. అలాగే తన షాపింగ్ మాల్‌కి విద్యుత్ బిల్లులు కూడా చెల్లించడం లేదు. ఇన్నిరోజులుగా అధికార బలంతో జీవన్‌రెడ్డి అ÷-దదె బకాయిలు అడగడానికి వచ్చిన అధికారులపై చెలరేగిపోయాడు. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో ఆర్టీసీ , విద్యుత్ అధికారులు రంగంలోకి దిగి జీవన్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగి షాపింగ్ మాల్‌కి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. షాపింగ్ మాల్‌కి బకాయి ఉన్న నగదును వెంటనే చెల్లించాలని లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఆర్టీసీ, విద్యుత్ అధికారులు హెచ్చరించారు.

## రోడ్డెక్కిన పోలీస్ భార్యలు



**వరంగల్ జిల్లా :(డైలీ రిపోర్ట్ )అక్టోబర్ 22:** శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ప్రజల జీవితాలకు, రాజకీయ నాయకుల ఆస్తులకు, రక్షణ కల్పిస్తున్న పోలీసు భార్యలు ఈరోజు రోడ్డెక్కారు.వరంగల్ జిల్లా మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. కానిస్టే బుళ్లను వెట్టిసాకిరి చేపిస్తూ,కనీసం సెలవులు కూడ ఇవ్వకుండా. కుటుంబానికి దూరం చేస్తున్నారని పోలీస్ భార్యలు కన్నీరు మున్నీ రుగా విలపిస్తున్నారు. అధికారులు తమ సమస్యలను పరిష్క రించాలని కానిస్టేబుళ్ల భార్యలు ఈరోజు రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు.నిరసనను ఆపేందుకు ఆర్ టీ ఓ ఆఫీస్ నుండి మామునూరు బెటాలియన్ వరకు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వ్ పోలీసుల బాధ లను అర్థం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి,ని కోరారు.. కొత్త డీజీ రావడం తోనే ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై పోలీసుల కుటుంబ సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించండి: మంత్రి శ్రీధర్ బాబుకు వినతి



**పెద్దపల్లి జిల్లా: (డైలీ రిపోర్ట్ )అక్టోబర్22:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, మంగళవారం మైదంబండ గ్రామస్తులు ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను కలిసి వినతి పత్రం అందజేశారు.గ్రామస్తులు ఇతర గ్రామాలకు వెళ్లాలన్న విద్యార్థులు స్కూళ్లకు కాలేజీలకు వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించా లని,మంత్రి శ్రీధర్ బాబును కోరారు. వెంటనే స్పందిం చిన మంత్రి శ్రీధర్ బాబు, గోదావరిఖని డిపో మేనేజర్ తో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో ముత్తారం మండల మాజీ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బియ్యని శివకుమార్, మైదంబండ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బూడిది శ్రీనివాస్, రాజబాబు, మహేందర్, రాజేందర్, రాము, పాల్గొన్నారు

## మర్పల్లి మండల మార్కెట్ చైర్మన్ నీ సన్మానించిన సఫైర్ అపార్ట్మెంట్ వాసులు



శంకర్పల్లి, అక్టోబర్ 22:(డైలీ రిపోర్ట్) శంకర్పల్లి మండల పరిధి మోకిల గ్రామంలో సఫైర్ అపార్ట్మెంట్ వాసులు అందరూ కలిసి మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డిని శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ నన్ను మార్కెట్ కమిటీ చైర్మన్గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రజలందరికీ రుణపడి ఉంటాను తెలిపారు. ప్రజాసేవ చేయడమనేది ఎన్నో జన్మల పుణ్యఫలం అని తెలిపారు. నన్ను ఎన్నుకున్న ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సదా మీ సేవలో ఉండి వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాలుగా సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ప్రెసిడెంట్ మాణిక్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గోవింద్, యూత్ ప్రెసిడెంట్ విజయ్, మహిపాల్ రెడ్డి, అంజిరెడ్డి,రామన్న, సుధాకర్, సురేష్, ఉత్తం, చరణ్, ఈశ్వర్, చందు తదితరులు పాల్గొన్నారు.


## శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సింగాపురం వార్డు ప్రజల ఆందోళన

శంకర్‌పల్లి: అక్టోబర్ 22: (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపురం వార్డుకు వెళ్లే ప్రధాన రోడ్డు విస్తరణ పనులను కొందరు ఆపే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆందోళన చేశారు. అధికారులు, స్థానిక నాయకులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని వార్డు ప్రజలు కోరారు.




## పశువులకు గాలి కుట్టు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి: పశు సంవర్ధకశాఖ

**నంగునూరు అక్టోబర్ 22 (డైలీ రిపోర్ట్):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల సిద్ధన్నపేట గ్రామంలో పశు సంవర్ధకశాఖ చేపట్టిన పశువులకు గాలి కొట్టు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం జరిగింది గోజాతి గేదజాతి పశువులకు గాలి కొట్టు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని అధికారులు సూచించారు మూగజీవుల్లో వ్యాధి నివారణకు ఆవులకు బర్రెలకు గాలి కొట్టు వ్యాధి టీకాలు వేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి, వెటర్నరీ సిబ్బంది నరేష్ ,కనకయ్య అరవింద్, భూపయ్య ,తదితరులు పాల్గొన్నారు



## శివానంద రిహాబిలిటీషేన్ సెంటర్ లో అన్నదాన కార్యక్రమం







హైదారాబాద్, అక్టోబర్ 21 (డైలీ రిపోర్ట్):(అస్క్ ఎడ్యూకేషన్ వెల్ఫేర్ సొసైటీ) వ్యవస్థాపకులు జే ఎన్ టీ యూ యూ ఎచ్ ప్రొపెసర్ వసుమతి, శివకుమార్ ఆధ్వర్యంలో శివానంద రిహబిలిటీషేన్ సెంటర్ లో అన్నదానం. కార్యక్రమం నిర్వహించారు. (అస్క్ ఎడ్యూకేషన్ వెల్ఫేర్ సొసైటీ) వ్యవస్థాపకులు జే ఎన్ టీ యూ యూ ఎచ్ ప్రొపెసర్ వసుమతి, శివకుమార్ ఆధ్వర్యంలో శివానంద రిహబిలిటీషేన్ సెంటర్ కూకట్పల్లిలో వద్ద అన్నదానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా చిన్న కొడుకు రోషన్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఇలా చేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎరవెల్లి జగన్, లకావత్ భానుప్రకాష్ నాయక్, హేమంత్ రీఛార్డ్, రూప్ సింగ్, దేవి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి



ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :-బోథ్ మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ తెలియజేశారు. నాబార్డ్ వారి ఆర్థిక సహకారంతో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సోనాల బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం వజ్జర గ్రామంలో ఆర్థిక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జీవిత బీమా పథకాల గురించి వివరించారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన లో 18 సంవత్సరాల నుంచి 50 ఏళ్ల వరకు వయస్సున్న వారు ఏటా రూ. 436 చెల్లించి చేరితే ఖాతాదారుడు అకాల మరణం లేదా సహజ మరణం చెందిన బాధిత కుటుంబానికి రూ.రెండు లక్షల బీమా అందుతుందని చెప్పారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో 18 నుంచి 70 ఏళ్ల వరకు వయస్సున్న వ్యక్తులు ఏటా రూపాయలు 20 చెల్లించి చేరితే ఖాతాదారుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ. రెండు లక్షల పరిహారం అందుతుందని వివరించారు. ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా వెయ్యి రూపాయలు చెల్లిస్తే రూ. 20 లక్షల ప్రమాద బీమా ను ఖాతాదారులు వినియోగించుకోవచ్చని చెప్పారు వ్యవసాయ రుణాలను ఏడాదిలోపు రెన్యువల్ చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీ లభిస్తుందని తెలిపారు . కళాజాత బృందం సభ్యులు బ్యాంకులో పొదుపులు, డిపాజిట్లు ,రుణాలు, ఇన్సూరెన్స్ పథకాలు, ఏటీఎం కార్డులు ,మొబైల్ బ్యాంకింగ్ ,ఓటీపీ నంబర్ , సైబర్ నేరాలపై మ్యాజిక్ షో ఆటపాటలతో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నరేందర్ , గ్రామ పటేల్ ,వివోఏ మాణిక్ రావు , కళాజాత బృందం సభ్యులు ,మహిళా సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు .

## జిల్లాస్థాయి 68వ వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన : ఎంపీడీవో వెంకయ్య గౌడ్






**శంకర్ పల్లి : అక్టోబర్ 22:(డైలీ రిపోర్ట్):**మంగళవారం నాడు జిల్లాస్థాయి 68వ వాలీబాల్ పోటీలను శంకర్ పల్లి ఎంపీడీవో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకయ్య గౌడ్ మాట్లాడుతూ మోకిల గ్రామ రైతు వేదిక వద్ద జరుగుతున్నటువంటి ఈ క్రీడలు తెలంగాణ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సోపానంగా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొంటున్నటువంటి విద్యార్థులు భవిష్యత్తులో స్పోర్ట్స్ కోట కింద ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి ఎన్నో అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. అదేవిధంగా ఇప్పుడు క్రీడలలో మంచి ప్రతిభ కనబరిస్తే, భవిష్యత్తులో రాష్ట్రానికి అదేవిధంగా దేశానికి ప్రాతినిధ్యం వహించే పరిస్థితులు ఉంటాయని ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటమి, జీవితంలో సమానంగా స్వీకరించి భవిష్యత్తును బంగారుమయంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అక్బర్, ఉపాధ్యాయులు రఘునందన్ రెడ్డి, ఆశీర్వాదం, శ్రీనివాస్ ఇతర ఉపాధ్యాయులు, తదితర రాజకీయ నాయకులు, క్రీడా ప్రేమికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 25న ఇందిరాపార్క్ ధర్నాను విరమించుకోండి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మంత్రి సీతక్క హితవు

హైదరాబాద్: బీజేపీ నేతలు ఈ నెల 25న ఇందిరాపార్కు వద్ద తలపె ట్టిన ధర్నాను విరమించుకోవాలని, గత పదేళ్లలో మూసీ ప్రక్షాళనకు, మూసీ ప్రాంత ప్రజల సంక్షేమం, ఉపాధికి నయా పైసా కేటాయించని కేంద్రం ఎదుట ధర్నా చేయాలని మంత్రి సీతక్క హితవు పలికారు. యూపీఏ హయాంలో మూసీ ప్రక్షాళనకు రూ.335 కోట్లు మంజూరు చేస్తే, మోదీ పాలనలో పైసా మంజూరు కాకపోయినా కిషన్‌రెడ్డి ఎందుకు పెదవి విప్పలేదని మంగళవారం ఓ ప్రకటనలో నిలదీశారు. ఇతర నదుల ప్రక్షాళన కు నిధులిచ్చి మూసీ ప్రక్షాళనకు పైసా కేటాయించకపోవడం తెలంగాణపై కేంద్రం వివక్షతకు నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు.సొంత నియోజకవర్గం మీదుగా మూసీ పారు తున్నా ఏనాడూ కేంద్రం నుంచి నిధులు తీసుకురాని కిషన్‌రెడ్డి ఇప్పుడు ధర్నాకు పిలుపునివ్వడం ఏమిటో ఆయన ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో బీజేపీకి చెందిన ముగ్గురు ఎంపీలు, ఒక కేంద్రమంత్రి ప్రాతిని ధ్యం వహిస్తున్నందున.. కేంద్రంతో చర్చించి హైదరాబాద్ జీవనరేఖగా భావించే మూసీ పునరుజ్జీవానికి రూ.10 వేల కోట్లు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును సమర్థిస్తున్న బీజేపీ ఇక్కడ మూసీ అభివృద్ధి ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు.





## వర్తమన్నూర్ గ్రామంలో కుటుంబాలను పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్

**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** బజార్ హత్నూర్ మండలంలోని వర్తమన్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ గారి మాతృమూర్తి ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలుసుకుని మరియు గ్రామంలోని అరెల్లి రాకేష్ యువకుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ఈరోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## నంగునూరు మండల కేంద్రంలో బంద



**నంగునూరు ,అక్టోబర్ 22 (డైలీ రిపోర్ట్) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో సికింద్రాబాద్ లో జరిగిన ముత్యాలమ్మ గుడి కూల్చివేత ఘటన సందర్భంగా నంగునూరు మండల కేంద్రంలో బందు కార్యక్రమం నిర్వహించడం జరిగింది హిందూ సంఘాల ప్రతినిధి రజనీకర్ మాట్లాడుతూ దేవాలయాలపై దాడి చేస్తున్న వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు గ్రామంలోని బాబు జగ్జీవన్ రావు వివేకానంద గాంధీ చౌరస్తాలోని వర్తక వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేసి సంఘీభావం తెలిపారు.

## డబ్బులిస్తావా... పక్కలోకి వస్తావా..!

### ఫీల్డ్ అసిస్టెంట్ పై జనసైనికులు వేధింపులు

### ఆత్మహత్యయత్నం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ సునీత



**కాకినాడ, అక్టోబర్ 22 (డైలీ రిపోర్ట్) :** పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ పూలపకుర సునీత పై జనసైనికులు వేధింపులు ఎక్కువవ్వడం తో భరించలేక తెల్లవారుజామున నిద్రమాత్రలు, టైల్స్ లోకి వాడే గమ్ ను కలుపుకుని త్రాగడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమెకు చికిత్సను అందిస్తున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. ఎన్.ఆర్.జీ.ఎస్ లో ఫీల్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వరిస్తున్న పూలపకూర సునీతను కరప మండలానికి చెందిన జనసేన నాయకులు బండారు మురళి, నానీబాబు, భవానీలు ఉపాధి హామీలో దొంగ మస్తార్లు వేసి నెలకు రూ.20వేలు ఇవ్వాలని గత మూడు నెలలుగా వేదిస్తున్నారని, బండారు మురళి తనతో సన్నిహిత్యంగా ఉండాలని, కోరిక తీర్చాలని వేధిస్తున్నాడని మనస్థాపం చెంది ఆత్మహత్యయత్నం చేసినట్లు, నానీబాబు అను వ్యక్తి కులదుషణ చేస్తూ మనసునొచ్చుకునే విధంగా మాట్లాడుతున్నాడని,తన భార్య ఆత్మహత్యయత్నానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని భర్త వీరబాబు కోరారు.

## రాజునాయక్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం ,అక్టోబర్ 22(డైలీ రిపోర్ట్):** రాంచెంద్రాగుడాలో మహేశ్వరం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అంగోత్.రాజు నాయక్ మామ “కీర్తిశేషులు రాత్లవత్ కోవెల నాయక్ “ మంగళవారంనాడు పరమపదించిన విషయం తెలుకున్న మాజీ మంత్రి వర్యులు నియోజకవర్గ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి రాంచెంద్రాగుడా చేరుకుని కోవెల నాయక్ పార్థివదేహానికి పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



